సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 12 । జనవరి । 2025



సోమశిలలో 70.875 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 70.875 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1426 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.80,520
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,310
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,530
సవర (8 గ్రాములు)	రూ.60,240

గరిష్ఠం/కనిష్ఠం 28.9 /22.8

వాతావరణం

ఆదివారం జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 68 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వడ్డే ఓబన్న ధైర్య సాహసాలు యువతకు స్ఫూర్తి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు రూరల్: తొలితరం స్వాతంత్య్ర సమర యోధుడు వడ్డే ఓబన్న ధైర్యసాహసాలు, పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వడ్డే ఓబన్న జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ వడ్డెర సంక్షేమ సంఘం నాయకుల విజ్ఞప్తి మేరకు నగరంలో వడ్డే ఓబన్న పేరుతో సామాజిక భవనం, విగ్రహం ఏర్పాటుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని చెప్పారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి మాట్లాడుతూ పేద రైతులు, గ్రామస్తుల హక్కులను కాపాడడానికి బ్రిటీష సామ్రాజ్యాన్ని ఎదిరించిన గొప్పవీరుడు ఓబన్న అని అన్నారు. పలువురు వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ వడ్డెరలను ఎస్సీ లేదా ఎస్టీలుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు బెల్లంకొండ శ్రీనివాసులు, ఉప్పు భాస్కర్‌రావు, వల్లెపు మునుస్వామి, గుంజి మనోహర్, గుంజి సుధాకర్, మల్లి నవీన్‌బాబు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటిన శ్రావణి



సాధించిన బంగారు పతకాలతో శ్రావణి

కలిగిరి: నేపాల్‌లో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగిన ఇండో–నేపాల్ జంప్‌రోప్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో కలిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రావణి సత్తాచాటి రెండు బంగారు పతకాలను కై వసం చేసుకుంది. జిల్లా జంప్‌రోప్ సెక్రటరీ జీ మురళి ఆధ్వర్యంలో చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న శ్రావణి లాంగ్‌రోప్, ఫ్రీ స్టైల్ రిలేలో ఈ పతకాలను సాధించింది. ఈ సందర్భంగా శ్రావణికి జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఐటీడీఏ పీఓగా విజయకుమార్ నియామకం

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వం శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 44 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. అందులో భాగంగా నెల్లూరు జిల్లా రాపూరు తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.కిరణ్‌కుమార్‌ను డిప్యుటేషన్‌పై వైఎస్సార్ జిల్లా మెప్మా పీడీగా నియమించారు. ఎల్.శివకుమార్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి నెల్లూరు జిల్లా ఏపీఐఐసీ జెడ్‌ఎంగా ప్రభుత్వం నియమించింది. రామాయపట్నం పోర్టులో జీఎం(ల్యాండ్స్)గా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.విజయకుమార్‌ను ఖాళీగా ఉన్న నెల్లూరు ఐటీడీఏ పీఓగా బదిలీ చేసింది.

టర్నోవర్.. ఢమాల్

- పేద, మధ్య తరగతి ప్రజలకు అందని సంక్షేమ ఫలాలు
- ఉద్యోగం, ఉపాధి, కూలీ పనులు కోల్పోయిన బడుగు జీవులు
- మరో వైపు కరెంట్ బిల్లుల బాదుడు
- బతుకే కష్టంగా మారిన పరిస్థితులు
- కళ తప్పిన పండగలు
- స్తంభించిన వ్యాపార లావాదేవీలు
- వాణిజ్య రంగం కుదేలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలలుగా ఆర్థిక చక్రం ఆగిపోయింది. సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. ఇసుక కొరత కారణంగా నిర్మాణ రంగం స్తంభించిపోవడంతో కూలీలకు బతుకుదెరువు కరువైంది. ఉపాధి పథకాన్ని టీడీపీ నేతలు తమకు ఉపాధిగా మార్చుకోవడంతో నిరుపేదలకు కూలి పనులు లేకుండా పోయాయి. ప్రభుత్వ రంగంలో చిరుద్యోగులు, వలంటీర్లు ఉద్యోగాలు కోల్పోయారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం కుప్ప కూలిపోవడంతో ఆ రంగాన్ని నమ్ముకున్న వేలాది మందికి రాబడి కొరవడి రోడ్డున పడ్డారు. బిడ్డల చదువులు, పెద్దల వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ కడుభారంగా తయారైంది. మరో వైపు కరెంట్ చార్జీల భారం పుండుమీద కారంలా మారింది. జనం చేతిలో ఫైనాన్షియల్ టర్నోవర్ స్తంభించింది. మొత్తంగా వాణిజ్య రంగం కుదేలైంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో లక్షల మంది ప్రజల జీవన చిత్రం ఒక్కసారిగా తల్లకిందులైంది. సామాన్యుడి నుంచి సంపన్నుల వరకు ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. గతేడాది.. ఇదే రోజుల్లో పల్లెల నుంచి పట్టణాల వరకు విలసిల్లిన సంతోషాల హరివిల్లులు.. ఈ ఏడాది మసక బారాయి. సరిగ్గా ఏడు నెలల క్రితం ప్రభుత్వం మారడంతో ప్రజల ఆర్థిక సాధికారతకు అడ్డంకులు ఏర్పడ్డాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లూ ప్రతి నెల.. ప్రతి కుటుంబం ఏదోక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందుతుండేది. వైఎస్ జగన్ సీఎంగా ఉండి ఉంటే.. జూన్ నుంచి డిసెంబరు వరకు ఏడు నెలల్లో సుమారు 20 లక్షల మందికి 13 పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.1,406.04 కోట్ల మేర లబ్ధి అంది ఉండేది. ప్రజల చేతికి చేరే ఈ డబ్బు.. తిరిగి మార్కెట్లో టర్నోవర్ అయి ఉండేది. కానీ ప్రభుత్వం మారడంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేసింది. ఫలితంగా వాణిజ్య రంగంలో టర్నోవర్ ఆగిపోయింది.

జిల్లాలో 80 శాతం మందికి లబ్ధి

జిల్లాలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీలు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు నగర పంచాయతీలు, నాలుగు రెవెన్యూ డివిజన్లు, 37 మండలాలు, 722 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సుమారు. 24.5 లక్షల మంది జనాభా ఉంది. ఇందులో గత ప్రభుత్వంలో దాదాపు 80 శాతం మందికి పైగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, నేతన్న నేస్తం, వాహనమిత్ర, మత్స్యకార భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, అమ్మఒడి, లానేస్తం. కల్యాణమస్తు–షాదీ తోఫా, వలంటీర్లకు, పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహాలు.. ఇలా చేతి నిండా డబ్బులుండేవి.

కుప్పకూలిన వ్యాపార రంగం

జిల్లాలో వ్యాపార రంగం కుప్పకూలిపోయింది. ఏడు నెలల్లోనే ప్రజల ఆశలు ఆవిరైపోయాయి. లక్షలాది మంది పేదలకు సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందలేకపోయారు. ముఖ్యంగా పేదలు తమ చేతిలో డబ్బులు ఉంటే తమకు అవసరమైన వాటిని కొనుగోలు చేస్తూ ఉండేవారు. గడిచిన ఐదేళ్లు.. ఏడాదికి జిల్లా ప్రజల చేతిలో సంక్షేమ పథకాల ద్వారా సగటున రూ.6,500 నుంచి రూ.7 వేల కోట్ల టర్నోవర్ జరిగేది. జూన్ నుంచి డిసెంబరు వరకు ఏడు నెలల్లో 13 సంక్షేమ పథకాల ద్వారా రూ.1,406 కోట్లు అంది ఉంటే.. జిల్లాలో ఈ మొత్తం వ్యాపార లావాదేవీల రూపంలో టర్నోవర్ ఉండేది. మార్కెట్లో వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆయా వస్తువుల అమ్మకాల ద్వారా పన్నులు రూపంలో నిధులు చేరేవి. అటు పేదల అవసరాలు తీరుతూ... ఇటు ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూరుతుండేది. పేద, మధ్య తరగతి ప్రజల చేతిలో టర్నోవర్ ఆగిపోవడంతో దీని ప్రభావం వ్యాపారం రంగంపై పడింది.

నిత్యం రూ.100 కోట్ల వ్యాపారం నుంచి.. ఢమాల్

జిల్లాలో వస్త్ర, నిత్యావసరాలు, హోటల్స్, షూమార్టు, ఫ్యాన్సీ, బంగారం, పండ్లు, కూరగాయలు, పెయింటింగ్స్, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రికల్స్, మెడికల్స్ తదితర వ్యాపారాలు నిర్వహించే దుకాణాల నుంచి మాల్స్ వరకు సుమారు 27 వేలకు పైగా ఉన్నాయి. వీటి ద్వారా గతేడాది గణాంకాలను బట్టి నిత్యం రూ.100 కోట్లపైగా వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం.

రూ.వందల్లోనే వ్యాపారం



ఇతని పేరు దాసరి సందీప్. ఆయన కోవూరులో గత కొన్నేళ్లుగా వస్త్ర, ఫ్యాన్సీ వ్యాపారం చేస్తున్నాడు. గతంలో వ్యాపారం బాగానే జరిగేది. ప్రస్తుతం వ్యాపారాలు గణనీయంగా తగ్గాయని చెబుతున్నాడు. రెగ్యులర్‌గా తన దుకాణానికి వచ్చే కస్టమర్లతో మాట్లాడితే డబ్బుల్లేవు.. ఉంటే చూద్దాంలే అంటున్నారని వాపోతున్నారు. గతంలో రోజుకు వేల రూపాయాల్లో వ్యాపారం జరిగితే.. ప్రస్తుతం వందల్లో కూడా జరగడం లేదంటున్నాడు.

కొనుగోలు తగ్గించారు



ఈయన పేరు గిద్దంటి రమణయ్య. మనుబోలు పట్టణంలో ఫ్యాన్సీ, కిరాణా మర్చంట్ దుకాణాన్ని కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఏడు మాసాలుగా వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయంటున్నాడు. ప్రజల వద్ద అవసరాలకు సరిపడా నగదు లేకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తుందని చెప్పారు. గతంలో ఏ వస్తువైనా.. కేజీల్లో కొనేవాళ్లు అరకేజీ, పావు కేజీ చాలని, ఒకటీ.. రెండు వస్తువులతో సరిపెట్టుకుంటున్నారని చెబుతున్నారు. దీనికి తోడు నిత్యావసర ధరలు పెరగడం కూడా కారణమంటున్నారు.

డబ్బుల్లేవ్ అంటున్నారు



ఇతని పేరు పీ జనార్దన్‌రెడ్డి. పొదలకూరు మండలం కనుపర్తి గ్రామానికి చెందిన ఈయన పొదలకూరు పట్టణంలో కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ఏడు మాసాలుగా వ్యాపారం ఎలా జరుగుతుందంటే పెదవి విరుస్తున్నాడు. ధరలు బాగా పెరగడంతోపాటు ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని, వ్యాపారాలు సవ్యంగా సాగడం లేదంటున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి నెల ఏదో ఒక సంక్షేమ పథకం కింద ప్రజలకు బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యేది. దీంతో పేద, మధ్య తరగతికి చెందిన వారి కొనుగోలు సామర్థ్యం ఉండేదని, ఇప్పుడా పరిస్థితి లేదంటున్నారు.



నెల్లూరు పెద్ద బజార్లో కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న వస్త్ర దుకాణాలు

వైఎస్ జగన్ సీఎంగా ఉండి ఉంటే..

ఏడు నెలల్లో 13 పథకాల ద్వారా చేకూరే లబ్ధి: రూ.1,406.04 కోట్లు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన లబ్ధి (రూ.కోట్లల్లో)
వసతి దీవెన	43,434	46.98
ఈబీసీ నేస్తం	31,706	86.36
రైతు భరోసా	2,44,757	134.62
ఉచిత పంటల బీమా	6,587	86.35
విద్యాదీవెన	37485	34.36
కల్యాణ మస్తు/షాదీతోఫా	500	4
మత్స్యకార భరోసా/డీజిల్ సబ్సిడీ	19,329	58
అమ్మఒడి	2,41,819	362.73
నేతన్న నేస్తం	5,131	41.90
జగనన్న తోడు	44,472	2.05
రైతులకు సున్నా వడ్డీ	4,63,993	188.42
కాపునేస్తం	9,281	139.22
వాహనమిత్ర	22,105	221.05









అయితే గడిచిన ఏడు నెలల్లో మొత్తంగా రూ.68 కోట్ల మేర టర్నోవర్ జరగలేదని తెలుస్తోంది.

ప్రజల పరిస్థితి ప్రస్తుతం ఇదీ..

బిడ్డలను చదివించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. ఫీజులు చెల్లించలేదని విద్యా సంస్థలు సర్టిఫికెట్లు పెండింగ్ పెట్టారు. ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. నేతన్న మగ్గం పనులకు పెట్టుబడి కోసం షావుకారుల వద్దకు పరుగులు పెడుతున్నాడు. వేట సాగక, సాయం అందక మత్స్యకారులు అప్పుల కోసం వెంపర్లాడుతున్నారు. ఆటోడ్రైవర్లు వాహనాలకు ఎఫ్సీలు, ఇన్‌స్రూ?న్స్ చేయించలేక చలానాలు కడుతున్నారు. ఏడు నెలలుగా ఇసుక కొరతతో భవన నిర్మాణ రంగం నిలిచిపోయింది. భవన కార్మికులు ఇళ్లలో ఆకలి కేకలు ఎక్కువయ్యాయి. ఇక్కడ బతుకుదెరువు లేక చెన్నై, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. పల్లెల్లో సీజన్‌ను బట్టి పంటలు సాగు చేసుకునే రైతులకు పెట్టుబడి సాయం అందించక పోగా, విత్తనాలు, ఎరువుల సమస్యలను సృష్టించింది. మరో వైపు ప్రకృతి అనుకూలించకపోవడంతో రైతులు కాడి వదిలేశారు. మైనింగ్ రంగంపై ప్రభుత్వ పెద్దల కన్ను పడింది. ఆ రంగాన్ని నమ్ముకున్న కార్మికులకు పనుల్లేక కుటుంబపోషణ గగనంగా మారిపోయింది. రియల్ ఎస్టేట్ రంగం పడిపోయింది. ప్లాట్లు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో ఆ రంగాన్ని నమ్ముకుని బతుకుతున్న వేలాది మంది ఇంట్లో కూర్చొని కుమిలిపోతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లల్లో ఆనందాలు, సంతోషాలు ఆవిరైపోయాయి. అప్పుల కష్టాలు వెంటాడుతుండంతో వారి ఇళ్లలో కళ తప్పింది. ఒక్క నవంబర్ నెలలోనే పది శాతం వృద్ధి రేటు తగ్గితే, డిసెంబరులో 6 శాతం వృద్ధి రేటు తగ్గినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.



కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న నెల్లూరులోని బంగారం షాపు

ఆర్థిక పరిస్థితి.. అస్తవ్యస్తం

నెల్లూరు జిల్లాలో వాణిజ్య దుకాణాలు **27** వేలకు పైగా

గతంలో నిత్యం జరిగే వ్యాపారం రూ.**100** కోట్లకు పైనే..

గడిచిన ఏడు నెలలుగా జరిగిన వ్యాపారం రూ.**68** కోట్లే

పథకాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు



గతంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెనలు వచ్చాయి. పండగలప్పుడు ఎంతో కొంత వినియోగించుకునే వాళ్లం. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి కావు. ప్రస్తుతం ఆ పథకాలు నిలిపివేడంతోపాటు నిత్యావసర సరుకులు ధరలు పెరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– పద్మ, బుజబుజనెల్లూరు

ఖర్చులు తగ్గించుకోవాల్సి వచ్చింది



సంక్రాంతి పండగ వచ్చిందంటే వారం ముందు నుంచే పిండి వంటల తయారీ సరుకులు, దుస్తులు కొనుగోలు చేస్తుంటాం. అయితే ఈ ఏడాది పండగకు ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వ పథకాలు(డీబీటీ) నిలిచిపోవడంతో వస్తువులు కొనుగోలు చేసేందుకు డబ్బులు లేని పరిస్థితి ఏర్పడింది. తప్పని పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకుంటున్నాం.

– రంజిత్, మైపాడుగేట్ సెంటర్

పండగ చేసుకునేట్టు లేదు



ఈ సంవత్సరం సంక్రాంతి పండగ ఏమీ చేసుకునేట్టుగా లేదు. పెరిగిన వంట నూనె, పప్పుల తోపాటు, నిత్యావసర వస్తువులు అమాంతం పెరిగిపోయాయి. గతంలో ప్రతి ఏడాది ఏదో ఒక పథకం ద్వారా మా బ్యాంకు అకౌంట్లలో ప్రభుత్వం నగదు జమ చేస్తూ ఉండడంతో సంతోసంగా జరుపుకునే వాళ్లం. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఏ ఒక్క పథకం రాకపోవడంతో డబ్బులకు ఇబ్బందిగా ఉంది.

– పాల జ్యోతి, గృహిణి, నెల్లూరు

తవ్వేయ్.. ఎత్తేయ్

సర్వేపల్లిలో రేయింబవళ్లు గ్రావెల్ అక్రమ రవాణా

- ఇష్టారాజ్యంగా కొల్లగొట్టేస్తున్నారు..
- పట్టించుకోని ఆయా శాఖల అధికారులు



సర్వేపల్లిలో గ్రావెల్ తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు నుంచి సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్, మట్టి తవ్వకాలకు విరామం లేకుండా పోయింది. ప్రభుత్వ భూములు, చెరువులు, చివరకు జాతీయ రహదారి భూములను కూడా వదలకుండా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన ఆయా శాఖల అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. వెంకటాచలం మండలం సర్వేపల్లిలో గడిచిన 15 రోజుల నుంచి రేయింబవళ్లు టీడీపీ నేతలు ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ కొల్లగొడుతున్నారు. గ్రామంలోని నిరు పేద ఎస్టీలకు కేటాయించిన భూములు సాగులో లేకపోవడంతో టీడీపీ నేతల కన్ను ఆ భూములపై పడింది. ఎర్ర నేల కావడంతో ఆ భూముల్లో పదుల సంఖ్యలో టిప్పర్లతో రేయింబవళ్లు గ్రావెల్ తవ్వకాలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. రెండు పొక్లెయిన్లతో గనులు మాదిరిగా తవ్వేస్తున్నారు. టిప్పర్ గ్రావెల్ ధర రూ.15 వేల నుంచి రూ. 20 వేలకు పైగా విక్రయిస్తున్నట్లు సమాచారం. గడిచిన ఏడు నెలల్లో ఒక సర్వేపల్లిలో ప్రాంతంలోనే సుమారుగా రూ.వంద కోట్ల మేర విలువ చేసే గ్రావెల్‌ను కొల్లగొట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రామస్తులు అడ్డుకున్నా.. ఆగని తవ్వకాలు

గ్రామానికి సమీపాన ఉన్న భూముల్లో 20 అడుగులకు పైగా లోతులో గ్రావెల్ గుంతలు తవ్వుతున్నారనే విషయం తెలియడంతో గ్రామస్తులంతా అక్కడకు చేరుకున్నారు. పేదలకు కేటాయించిన భూముల్లో తవ్వకాలు ఏమిటని ప్రశ్నించారు. ఈ గుంతల్లో పడి గేదెలు, మేకలు మృతి చెందుతాయని, తవ్వకాలు నిలిపివేయాలని గొడవకు దిగినా పట్టించుకోలేదు. మాకు అన్నీ అనుమతులు ఉన్నాయని, అడ్డుకునే ప్రయత్నం చేస్తే కేసులు పెడతామని బెదిరించడంతో గ్రామస్తులు చేసేదేమీ లేక వెనుతిరిగి వచ్చేశారు. అధికారం చేతిలో ఉంటే పేదలకు మేలు చేయాలే కానీ, గ్రామస్తులను బెదిరించి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడం ఏమిటని మండి పడుతున్నారు.



తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

తిరుపతి మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. నెల్లూరులో ఫిబ్రవరిలో జరగనున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలకు చెందిన పోస్టర్‌ను విడుదల చేసేందుకు ఆయన శనివారం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో తొక్కిసలాట, భక్తుల మరణాలకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. మృతిచెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మోదీ భజనలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు తరిస్తూ విభజన చట్టంలోని హామీల అమలుకు తిలోదకాలు ఇచ్చారని విమర్శించారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి, జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కావాలా..
చౌక దుకాణానికి రండి

2014 – 19 మధ్య రేషన్ దుకాణాల బయట క్యూలు దర్శనమిచ్చేవి. రేషన్ షాపులు ఎప్పుడు తెరుస్తారో.. సరుకులు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితుల్లో లబ్ధిదారులు తీవ్ర ఆందోళనతో ఉండేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చింది. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్‌ను పంపింది. కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత చౌక దుకాణాల ఎదుట మళ్లీ క్యూలు దర్శనమిస్తున్నాయి. సరుకుల కోసం కార్డుదారులు పడిగాపులు కాసే రోజులు మళ్లీ వచ్చాయి.

- వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే..
- పాత పద్ధతికే వచ్చేలా కూటమి ప్రభుత్వం కుట్రలు
- ఎండీయూ వాహనాల మరమ్మతులను పట్టించుకోని వైనం
- కార్డుదారులు రేషన్ షాపులకు వెళ్లేలా చేస్తూ..
- 2014 – 19 నాటి క్యూలైన్లు మళ్లీ దర్శనం



రెండు రోజుల క్రితం ఎన్టీఆర్ నగర్‌లోని చౌక దుకాణం వద్ద కార్డుదారుల పడిగాపులు

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు ఎన్నో చేపట్టారు. వాటికి కూటమి ప్రభుత్వం మంగళం పాడేలా వ్యవహరిస్తోంది. రేషన్ పంపిణీలో ఎండీయూ వాహనాలకు స్వస్తి పలికి, పాత విధానాన్ని అమలు చేసేలా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కార్డుదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నెల్లూరు నగరంలో వాహనాల ద్వారా కాకుండా పదికి పైగా చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ జరిగింది. కార్డుదారులు క్యూలైన్లలో గంటల తరబడి ఉండాల్సి వచ్చింది.

ఇంటి వద్దే..

2014 – 19 నడుమ రేషన్ కోసం ప్రజలు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. పల్లెల్లో పనులు మానుకుని ఎదురు చూసేవారు. ఈ కష్టాలు చూసిన వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్డుదారుల ఇళ్ల వద్దే రేషన్ పంపిణీకి చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ఎండీయూ వాహనాలు ఏర్పాటయ్యాయి. వాహనం ఏ తేదీలో, ఏ సమయంలో వస్తుందో సమాచారాన్ని లబ్ధిదారులకు వలంటీర్లు ముందే ఇచ్చేవాళ్లు. దీంతో సరుకులు సులభంగా అందేవి. పనులు మానుకుని రేషన్ కోసం దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నాడు తప్పింది.

ఇప్పుడిలా..

చంద్రబాబు ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది. అందులో భాగంగా ఎండీయూ వాహనాలకు స్వస్తి పలకాలని ప్రయత్నిస్తోందని సమాచారం. మరమ్మతులకు గురైన వాహనాల గురించి పట్టించుకోవడం లేదు. అలాగే కూటమి ప్రభుత్వం తమను కొనసాగించే పరిస్థితుల్లేవని కొందరు ఎండీయూ ఆపరేటర్లు వాహనాలను రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలకు ఇతరులకు విక్రయించినట్లు తెలిసింది. కాగా ఆపరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లి థంబ్ వేస్తేనే రేషన్ పంపిణీ జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 50కి పైగా వాహనాలు ఇతరులకు విక్రయించిన నేపథ్యంలో చౌక దుకాణాల్లో డీలర్ల ద్వారా సరుకులు అందిస్తున్నట్లు తెలుస్తోంది.

వారికి అందని రేషన్

జిల్లా వ్యాప్తంగా ఫింగర్ ప్రింట్, ఐరిష్ పడని కార్డుదారులు సుమారు 80 వేలకు పైగా ఉన్నారు. వారికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు థంబ్ వేసి రేషన్ పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల సేవలను పక్కన పెట్టేయడంతో ఐరిష్, ఫింగర్ ప్రింట్లు పడని కార్డుదారులకు సరుకులు అందడం లేదు. ఐదునెలలుగా ఈ పరిస్థితి ఉంది.

జిల్లాలో..

రేషన్ షాపులు : 1,513

కార్డుదారులు : 7.38 లక్షలు

గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాలు : 438

నెలకు పంపిణీ చేసే బియ్యం : 13 వేల మెట్రిక్ టన్నులు

చర్యలు తీసుకుంటాం

కార్డుదారులు ఇబ్బందులు పడకుండా రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు చేపడతాం. ఐరిష్, ఫింగర్ ప్రింట్ పడని వారికి సరుకులు అందేలా చూస్తాం.
– అంకయ్య, డీఎస్‌ఓ

ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించండి



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్, చిత్రంలో పోలీస్ అధికారులు

- ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి
- కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ జి.కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'సంక్రాంతి సందర్భంగా ఊర్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) సేవలను వినియోగించుకోవాలి' అని ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పండగ వేళల్లో చోరీలు అధికంగా జరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, కోడిపందేలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సంక్రాంతి సెలవుల్లో స్వగ్రామాలకు, తీర్థ, విహారయాత్రలకు వెళ్లేవారు విలువైన వస్తువులు, ఆభరణాలు వెంట తీసుకెళ్లాలని, లేనిపక్షంలో లాకర్లలో భద్రపరచాలన్నారు. ఊర్లకు వెళ్లే సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో దొంగతనాలను కట్టడి చేయొచ్చన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఫోన్లలో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఊర్లకు వెళ్లే సమయంలో రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌ను ఎంపిక చేసుకుని ఏ తేదీన, ఏ సమయానికి వెళ్తున్నారు?, తిరిగి ఎప్పుడొస్తారు? తదితర వివరాలను యాప్‌లో పొందుపరచాలన్నారు. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కు వెళ్తుందని, సిబ్బంది సదరు ఇంట్లో నిఘా కెమెరాలను అమరుస్తారన్నారు. అక్కడ ఎలాంటి కదలికలున్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుందని, వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ సిబ్బందికి సమాచారం వెళ్తుందన్నారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకుని దొంగలను పట్టుకునే అవకాశం ఉందన్నారు. 94407 96383, 93929 03413 ఫోన్ నంబర్లు, స్థానిక పోలీసులను సంప్రదించి ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉచితంగా పొందవచ్చని ప్రజలకు సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 7,200 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా రెండు వేల మందికి పైగా యాప్ సేవలను ఉపయోగించుకున్నారని చెప్పారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా వెంటనే స్థానిక పోలీసులకు లేదా, డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరెడ్డి, జి.శ్రీనివాసరావు, రాజగోపాల్, చెంచురామారావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇస్తానని ఓ యువకుడి నుంచి నగదు తీసుకుని మోసగించిన వ్యక్తిపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. జెండా వీధికి చెందిన శ్రీనివాసులు ఎంఎస్సీ కంప్యూటర్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఏడాది క్రితం అతని ఇంటికి సమీపంలోని ఓ యువతి ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీ యజమాని పేరిట అనూక్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తన కంపెనీలో ఉద్యోగం ఇస్తానని అతను శ్రీనివాసులు వద్ద రూ.4 లక్షలు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా జాబ్ రాకపోవడంతో బాధితుడు ఆరా తీయగా అసలు కంపెనీయే లేదని తెలిసింది. తనను మోసగించిన అనూక్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బంగారు సరుడు మాయం



బాధితురాలు వెంకటసుబ్బమ్మ

మర్రిపాడు: ఓ వృద్ధురాలు బస్సులో ప్రయాణిస్తుండగా ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు సరుడు మాయమైంది. వివరాలు.. వింజమూరు మండలం శంఖవరం గ్రామానికి చెందిన లెక్కల వెంకటసుబ్బమ్మ చికిత్స నిమిత్తం శనివారం నెల్లూరుకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో చెన్నై నుంచి వస్తున్న ఉదయగిరి ఆర్టీసీ బస్సు ఎక్కింది. డీసీపల్లిలో దిగే క్రమంలో ఆమె మెడలో బంగారు సరుడు లేదు. ఆందోళనకు గురైన వెంకటసుబ్బమ్మతోపాటు కుటుంబసభ్యులు బస్సును డీసీపల్లి సెంటర్‌లో నిలిపేశారు. సుమారు గంటపాటు నిలిచిపోవడంతో ఇతర ప్రయాణికులు, సిబ్బంది సరుడు పోగొట్టుకున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి బస్సును పంపించారు.

పంట కాలువలో పడి వ్యక్తి మృతి



మస్తాన్ మృతదేహం

అల్లూరు: పంట కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ఇస్కపల్లి పంచాయతీ ఆదిరాఘవపురం సమీపంలోని పంట పొలాల్లో జరిగింది. శనివారం అల్లూరు ఎస్సై కిశోర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఉద్దీపగుంట గ్రామానికి చెందిన పోట్లూరు మస్తాన్ (53)కి మూర్ఛ వ్యాధి ఉంది. అతను శుక్రవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. శనివారం ఆదిరాఘవపురం సమీపంలోని పంట కాలువలో మస్తాన్ మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోయినట్లుగా భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికకు వాగల్ నర్వ్ చికిత్స

నెల్లూరు(అర్బన్): పుట్టుకతోనే మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వెంకటగిరికి చెందిన పల్లవి అనే 16 సంవత్సరాల బాలికకు తొలిసారిగా వాగస్ నర్వ్ స్టిములేషన్ చికిత్స చేసి నయం చేశామని నారాయణ ఆస్పత్రి న్యూరాలజీ డాక్టర్ ఎస్ఎస్ సంపత్ కుమార్ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పల్లవికి అనేక మందులు వాడినా ఫలితం రాలేదన్నారు. 12 ఏళ్లుగా వివిధ ఆస్పత్రుల్లో తిరిగారన్నారు. అయినా తగ్గకపోవడంతో తమ హాస్పిటల్‌కు వచ్చారన్నారు. బాలికకు అన్ని రకాలు పరీక్షలు చేసిన అనంతరం తాము సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యాన్ని రాష్ట్రంలో తొలిసారిగా అందించామన్నారు. సమావేశంలో కన్సల్టెంట్ న్యూరోసర్జన్ సాయికిరణ్, ఆస్పత్రి అడిషనల్ సూపరింటెండెంట్ హరీష్, ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కోడూరుపాడులో ఎడ్ల బండలాగుడు పోటీలు



పోటీల్లో బండను లాగుతున్న ఎడ్లు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ పరిధిలోని కోడూరుపాడు గ్రామంలో శనివారం ఎడ్ల బండలాగుడు పోటీలు జరిగాయి. వీటిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కోడూరుపాడులో ఊళ్లమ్మ తల్లి కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమం జరిగింది. అనంతరం పోటీలను నిర్వహించారు. ఏపీ, తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి ఎడ్లను తీసుకొచ్చారు. పోటీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న కోడూరు కమలాకర్‌రెడ్డిని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభినందించారు. బొర్రెడ్డి కేశవరెడ్డి, సుంకి సురేందర్‌రెడ్డికి చెందిన ఎడ్లు మొదటి స్థానంలో నిలిచాయి. వారికి రూ.లక్ష బహుమతి అందించారు. రెండో స్థానంలో కుర్ర వెంకటేష్ యాదవ్‌కు చెందిన ఎడ్లు, మూడో స్థానంలో పీఆర్ పులగం తిష్షగ్నరెడ్డి, జస్విత‌రెడ్డికి చెందిన ఎడ్లు నిలిచాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 218
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 145



కంటైనర్‌లో బీఫ్ తరలిస్తుండగా..

- సీజ్ చేసిన అధికారులు, పోలీసులు
- నాలుగు టన్నుల పట్టివేత



కంటైనర్ వద్ద అధికారులు

నెల్లూరు(బారకాసు): బీఫ్‌ను కంటైనర్‌లో తరలించేందుకు సిద్ధం చేయగా పోలీసుల సహకారంతో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ విభాగాధికారులు శనివారం సీజ్ చేశారు. వివరాలను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్‌లు వెల్లడించారు. కొందరి ఫిర్యాదు మేరకు 12వ డివిజన్ చింతారెడ్డిపాళెం సమీప ప్రాంతంలో అనుమతి లేకుండా మాంసాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్న కంటైనర్‌ను సీజ్ చేశారు. యజమానిని విచారించగా అనుమతి లేని విషయం బయటపడింది. నాలుగు టన్నుల మాంసం ఉన్నట్లు గుర్తించారు. మాంసాన్ని దొంతాలి యార్డుకు తరలించి నిర్వీర్యం చేయనున్నామని వారు వెల్లడించారు.

పది సవర్ల బంగారం చోరీ

సంగం: నెల్లూరు నుంచి ఏఎస్‌పేట మండలం కొండమీదకొండూరుకు వెళ్లేందుకు ఆత్మకూరు బస్సు ఎక్కిన ఓ మహిళ బ్యాగ్‌లో శనివారం బంగారం చోరీకి గురైంది. దీనిపై సంగం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు.. ఏఎస్‌పేట మండలం కొండమీదకొండూరుకు చెందిన కె.శిరీష, కమలాకర్ దంపతులు నెల్లూరులో నివాసముంటున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా కమలాకర్ తన భార్య శిరీషను నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్‌కు వచ్చి బస్సు ఎక్కించాడు. పండగ కావడంతో ఆమె తన పది సవర్ల బంగారు నగలను బ్యాగ్‌లో పెట్టుకుంది. బుచ్చిరెడ్డిపాళెం సమీపంలో బ్యాగ్ జిప్ తెరిచి ఉండటాన్ని గమనించిన శిరీషకు బంగారు నగలు కనిపించలేదు. దీంతో పెద్దగా కేకలు వేసింది. డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన పెట్టి ప్రయాణికుల వద్ద వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో శిరీష ఈ సమాచారాన్ని వెంటనే భర్త కమలాకర్‌కు తెలియజేయడంతో ఆయన సంగం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు రూ.5 లక్షలకు పైగా బంగారు నగలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(టౌన్): 'విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రాథమిక దశలోనే బలమైన పునాది వేసేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలి' అని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. నెల్లూరులోని వీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎస్సీఈఆర్టీలో దక్షిణాది రాష్ట్రాల డైట్ అధ్యాపకులకు జరుగుతున్న శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సులభతరంగా, అర్థవంతంగా బోధించినప్పుడే విద్యార్థులు సులువుగా గ్రహించగలరన్నారు. 2020 జాతీయ విద్యా విధానంలో భాగంగా భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత స్థాయికి తీసుకొచ్చే విధంగా పాఠ్య ప్రణాళికలను తయారు చేశారన్నారు.

రేపు పీజీఆర్ఎస్ రద్దు

నెల్లూరు(క్రైమ్): భోగి పండగ నేపథ్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని సూచించారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 56.392 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 950, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.29

సన్నవి : రూ.23

పండ్లు : రూ.12

